క్లుప్తంగా

ఈ-కేవైసీ పూర్తి చేయండి

ఆస్పరి: రబీ సీజన్‌లో రైతులు సాగుచేసిన శనగ పంటకు సంబంధించి వంద శాతం ఈ-కేవైసీ పూర్తి చేయాలని ఏఓ మునెమ్మ సూచించారు. మంగళవారం ఆస్పరి ఆర్‌బీకేలో మండలంలోని వీఏఏ, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. మండలంలో ఇప్పటివరకు 38 శాతం మాత్రమే ఈ-కేవైసీ చేయించారని, రెండు రోజుల్లో మిగతా రైతులతో ఈ-కేవైసీ పూర్తి చేయించాలన్నారు.

ముగిసిన ఉరుసు

'ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామంలో నేముటూరు ఉసేని వలి తాత ఉరుసు ఉత్సవాలు మంగళవారం జియారత్‌తో ముగిశాయి. భక్తులు దర్గాలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. మండల ఉపాధ్యక్షురాలు చంద్రకళ, సర్పంచ్ లక్ష్మి, నాయకులు మురళీరెడ్డి, రాజన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి కబడ్డీ పోటీలు

ఆస్పరి: బిణిగేరి గ్రామంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈనెల 19వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసులు స్వామి మంగళవారం తెలిపారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.12 వేలు, తరువాతి స్థానాలకు వరుసగా రూ.8 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల జట్లు ఈ నెల 18 లోపు ఎంట్రీ ఫీజు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ 90002 43007, 86395 34393 నంబర్లను సంప్రదించాలన్నారు.

21న బండలాగుడు పోటీలు

ఆస్పరి: బిణిగేరిలో శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా 21వ తేదీన రాష్ట్రస్థాయి వృషభాల రాతి దూలం పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసస్వామి మంగళవారం తెలిపారు. గెలుపొందిన వృషభాల యజమానులకు మొదటి బహుమతి రూ.50 వేలు, తరువాతి స్థానాలకు రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు చొప్పున ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వృషభాల యజమానులు అదే రోజు ఎంట్రీ ఫీజు రూ.600 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని వివరాలకు సెల్ 9381829338, 81794 69377 నంబర్లను సంప్రదించాలన్నారు.

భజన పోటీలు

ఈనెల 21న రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించి విజేతలకు వరుసగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. ఉత్తమ హార్మోనిస్టు, తబలిస్టులకు రూ.వెయ్యి చొప్పున అందించనున్నట్లు చెప్పారు. ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

ఆస్పరి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో తహసీల్దార్ కుమార స్వామి ఆదేశాలతో మంగళవారం ఆస్పరిలో రెవెన్యూ సిబ్బంది ఫ్లెక్సీలను తొలగించారు. అంబేడ్కర్ సర్కిల్, బస్టాండ్, పెద్ద బజారులో ఫ్లెక్సీలను తొలగించి ట్రాక్టర్‌లో తరలించారు.

18 నుంచి ఉత్సవాలు

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం - మద్దికెర గ్రామాల మధ్య వెలసిన అవధూత కొండప్ప స్వామి ఉత్సవాలు ఈనెల 18 నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు పక్కీరమ్మ, పక్కీరప్ప తెలిపారు. 18వ తేదీ శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం, మహామంగళహారతి, రుద్రాభిషేకం జరుగుతాయన్నారు. అలాగే మహాశివరాత్రి సందర్భంగా రాత్రి భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 19న ఆదివారం కొండప్ప స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం రథంపై స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుంచి జనవాహని మధ్య రథోత్సవం నిర్వహిస్తామన్నారు.

తుగ్గలికి చేరిన సైకిల్ యాత్ర

తుగ్గలి: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలనే డిమాండ్‌తో శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం బోరగాం గ్రామానికి చెందిన దివ్యాంగుడు నెయ్యల ప్రసాద్ చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం తుగ్గలికి చేరుకుంది. మూడు చక్రాల సైకిల్‌పై ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు యాత్ర చేపట్టినట్లు ప్రసాద్ తెలిపారు. కాగా దివ్యాంగుడిని తహసీల్దార్ రవి అభినందించి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయమందించారు. ఆర్‌ఐ సుధాకరరెడ్డి, వీఆర్వోలు ఉన్నారు.

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

వెల్దుర్తి: మండల పరిధిలోని సిద్ధినగట్టు సమీపంలో రామళ్లకోట - కాల్వబుగ్గ రహదారిలో సోమవారం రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో తండ్రీ, కూతురుతో సహా ముగ్గురు గాయపడ్డారు. డోన్ మండలం మిద్దెపల్లెకు చెందిన రామాంజనేయులు ఇంటర్మీడియెట్ చదువుతున్న కూతురు అనూషతో కలిసి నంద్యాల జిల్లా నెరవాడ కాలేజీకి వెళ్తుండగా ఎదురుగా రామళ్లకోటకు చెందిన రాకేశ్, గణేశ్ ఆర్జీఎం కాలేజీలో డిప్లొమా పరీక్షలు రాసి బైక్‌పై తిరిగి వస్తూ ఢీకొట్టారు. కిందపడి గాయపడ్డ వారిలో తండ్రీ, కూతురును 108 వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. మరో బైక్‌లోని రాకేశ్ వెల్దుర్తి ఆసుపత్రిలో చికిత్స పొందాడు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

గోనెగండ్ల: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు వీరన్న, మండల అధ్యక్షుడు ఖాజా మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలను మరింత మెరుగు పరిచేందుకు క్విజ్ నిర్వహించినట్లు తెలిపారు. క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ షాహినా పర్వీన్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

బ్రహ్మగుండం క్షేత్రానికి మహర్దశ

- వైఎస్సార్‌సీపీ హయాంలో ఏటేటా అభివృద్ధి
- ఎగబాకుతున్న ఆలయ ప్రతిష్ట
- తిరునాలకు ఏర్పాట్లు ముమ్మరం



బ్రహ్మగుండం క్షేత్రం

వెల్దుర్తి: పట్టణ సమీపంలోని మహిమాన్విత శైవ క్షేత్రం బ్రహ్మగుండం. దశాబ్దాలుగా ప్రకృతి వైపరీత్యానికి, గత పాలకుల నిర్లక్ష్యానికి గురై, అభివృద్ధికి నోచుకోకపోగా దిగజారిన ప్రతిష్టకు అద్దం పలికింది. వైఎస్సార్‌సీపీ పాలనలో ఎమ్మెల్యే, స్థానిక నాయకుల సహకారం, ఆలయ పరిపాలనాధికారి, ధర్మకర్తల మండలి చైర్మన్ల అంకితభావానికి తోడుగా ప్రకృతి సహకరించడంతో రెండేళ్లుగా అభివృద్ధి పరుగులు పెట్టింది. ఆలయ ప్రతిష్ట ఇనుమడించింది. లక్షలాది భక్తులు మనసారా కామేశ్వరీదేవి సమేత బ్రహ్మగుండేశ్వరుడిని దర్శించుకుని ఉత్సవాలలో పాల్గొంటున్నారు.

అభివృద్ధి పరుగులు

బ్రహ్మగుండం క్షేత్రం నీరు సమృద్ధిగా కలిగిన ప్రాంతంగా పేరెన్నికగన్నది. దశాబ్దం క్రితం ప్రకృతి కన్నెర్ర చేయడంతో కరువు కాటకాలు మొదలై వానజాడ లేక భూగర్భజలాలు ఇంకిపోయాయి. చుట్టుపక్కల ప్రాంతాలలో బోర్లు అధికమవడంతో క్షేత్రంలోని సర్వదోశ నివారణిగా పేరు గాంచిన పుష్కరిణి (కోనేరు) ఎండిపోయింది. భారీ వృక్షాలు సైతం ఎండిపోయి నేలకూలుతూ వచ్చాయి. గత టీడీపీ హయాంలో కేవలం రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, ఆలయ ప్రాకారం పైకప్పు మరమ్మతులు తప్పా ఇతర పనులు చేపట్టలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం, పత్తికొండ ఎమ్మెల్యేగా కంగాటి శ్రీదేవి ఎన్నిక, 2020లో డోన్ గ్రూప్ దేవాలయాలకు ఇన్‌చార్జ్‌గా వెల్దుర్తి పరసర ప్రాంతం లద్దగిరి రామాపురానికి చెందిన టి.హనుమంతరావ్ ఈఓగా బాధ్యతలు స్వీకరించడం, అదే ఏడాది పట్టణానికి చెందిన బొమ్మన పెద్దిరెడ్డి ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయడం, ప్రకృతి కరుణించి సమృద్ధిగా వర్షాలు కురవడం, భూగర్భ జలాలు పెరగడం, పుష్కరిణిలో నీటి ఊట, ప్రభుత్వం, దేవదాయ, పంచాయతీ శాఖల సమన్వయంతో పాటు స్వామి సేవలో దాతలు ముందుకు రావడంతో ఆలయ అభివృద్ధి పరుగులు పెట్టింది. సౌకర్యాలు మెరుగుపడుతున్నాయి. ఆలయ ప్రతిష్ట ఇనుమడించేలా కార్యక్రమాలు నిర్వహించడంతో ఏడాదికేడాది భక్తులు పెరిగారు.

చేపట్టిన అభివృద్ధి పనులు

- పట్టణం నుంచి బ్రహ్మగుండానికి సింగిల్ రోడ్డుతో పాటు, పట్టణ సమీపంలోని బ్రిడ్జ్ రాకపోకలకు, ఉత్సవాల సమయంలో ఇరుకుగా, ప్రమాదాలకు నెలవుగా ఉండేది. ప్రస్తుతం రూ.2 కోట్లతో వెల్దుర్తి వంకపై బ్రిడ్జి వెడల్పు చేసి, రామళ్లకోట వరకు వయా బ్రహ్మగుండం రూ.10 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మించారు.
- 2021 శివరాత్రి నాటికి రూ.1,68,000లతో ఆలయం లోపలి నాగుల కట్ట అభివృద్ధి, రూ.4 లక్షలతో గుడి లోపల రైలింగ్, గ్రానైట్ బండ పరుపు, రూ.1,20,000లతో గుడి ముందు నంది విగ్రహాల అభివృద్ధి, రూ.80 వేలతో రేకుల షెడ్, రూ.40 వేలతో సీసీ కెమెరాల ఏర్పాటు, రూ.40 వేలతో క్షేత్రం అంతా వినిపించేలా మైక్ సిస్టిమ్, రూ.50 వేలతో హుండీల ఏర్పాటు, రూ.15 వేలతో బండలాగుడు పోటీలకు నూతన బండ రాయి, పూజలో ఉపయోగించే ఢమరుకం ఏర్పాటు చేశారు.
- 2022 శివరాత్రి నాటికి ఆలయ ప్రాంగణంలో రూ.3 లక్షలతో రాతి బండల నిర్మాణం, రూ.40 వేలతో కోనేటి వద్ద రోడ్డు, రూ.లక్షతో పూజారి గది, సత్రాల అభివృద్ధి, రూ.2 లక్షలతో ఆలయం ప్రహరీ, గోపురాలకు అధునాతన పెయింటింగ్, ఉత్సవ విగ్రహాల ఊరేగింపునకు పల్లకీ నిర్మాణం, విద్యుత్ ఓవర్‌లోడ్ ఇబ్బందులు లేకుండా ఉన్న 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌కు తోడుగా రూ.2 లక్షలతో 63 కేవీఏ నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, ఆలయ పరిసరాల్లో మొక్కల పెంపకం చేపట్టారు.



నీటితో కళకళలాడుతున్న ఆలయ పుష్కరిణి



భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక క్యూలైన్

ప్రస్తుతం కొనసాగుతున్న పనులు

రూ.2,50,000లతో క్యూలైన్ ఏర్పాటు, రూ.40 వేలతో ప్రధాన ద్వారానికి గేట్, రూ.3,40,000లతో చౌడమ్మ గుడి నిర్మాణం, రూ.4 లక్షలతో బాత్ రూమ్, టాయిలెట్ల ఏర్పాటు, రూ.లక్షతో ఆలయం పక్కన కాంపౌండ్ వాల్ ఏర్పాటు, రూ.1,80,000లతో ఆలయ ప్రాంగణంలో గ్రానైట్ ఏర్పాటు, రూ.25 వేలతో టికెట్ కౌంటర్ నిర్మాణం, రూ.1,75,000లతో ప్రహరీ మరమ్మతులు, రూ.25 వేలతో అభిషేకం నీటి అండర్ గ్రౌండ్ కాలువ నిర్మాణం, రూ.60 వేలతో అర్ధమంటపం (గర్భగుడి అనుకుని) గదిలో భక్తుల ఉక్కపోత తగ్గించేలా ఫ్యాన్లు, ఏసీ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి.

ఆలయ ప్రతిష్ట ఇనుమడించేలా చర్యలు

ఆలయ ప్రతిష్ట ఇనుమడించేలా పుష్కరిణిలో నీటి ఊట రావడం, బోరుద్వారా నీటి పంపింగ్, పుష్కరిణి మరమ్మతులు, జాగరణ రోజు నాటక ప్రదర్శనలు, స్వామివారి కల్యాణం వీక్షించేలా అతిపెద్ద స్క్రీన్‌ల ఏర్పాటు, బండలాగుడు పందేలు, ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో నిత్యాన్నదానం, ఆలయ ప్రతిష్ట నలుమూలల వ్యాపించేలా ఇటీవల ప్రముఖ రచయిత్రి పార్వతీదేవి రచించిన బ్రహ్మగుండేశ్వర క్షేత్ర చరిత్ర పుస్తకం 1000 ప్రతుల ముద్రణ, నలుదిశలా ప్రచారం, జాగరణ నుంచి వసంతోత్సవం వరకు అధికారుల నుంచి ఆయకట్టు దారుల వరకు సంయుక్తంగా ఈనెల 18 నుంచి జాగరణతో ప్రారంభమై 20న రథోత్సవం, 21న వసంతోత్సవం, బండ పందెం తదితర ఉత్సవాల నిర్వహణ, సౌకర్యాల ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.

అందరి సహకారంతో అభివృద్ధి



బ్రహ్మేశ్వరుడి చలువ, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, స్థానిక పంచాయతీ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అర్చకులు, ఆయకట్టుదారులతో పాటు ప్రకృతి సహకారం, దాతలు మాపై ఉంచిన నమ్మకంతో ఆలయ అభివృద్ధి సాధించగలుగుతున్నాం. ఉత్సవ సందర్భాలలో భక్తులకు సౌకర్యాలు పెంచగలుగుతున్నాం. 18న ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మగుండేశ్వరుడి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధతో పనులు చేపట్టాం. భక్తులు పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలి.

– ఈఓ హనుమంతరావ్, చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి



వెల్దుర్తి పంచాయతీ నిధులతో పూర్తికావొచ్చిన టాయ్‌లెట్ల నిర్మాణం

ఎస్టీ రిజర్వేషన్ సాధనకు ఉద్యమిద్దాం



ఎమ్మిగనూరులో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వాల్మీకి నాయకులు

ఎమ్మిగనూరు రూరల్: వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణకు ఐకమత్యంతో ఉద్యమించాలని బీజేపీ ఓబీసీ మోర్చ జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు, హిందూపురం అంబికా లక్ష్మీనారాయణ, తెలంగాణ సివిల్ సప్లై చైర్మన్ గట్టు తిమ్మప్ప, గుడిసె కృష్ణమ్మలు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని అజంతా ఫంక్షన్ హాల్‌లో వాల్మీకి వనభోజన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి రౌండ్ టేబుల్ సమావేశానికి వాల్మీకి నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఎస్టీ రిజర్వేషన్ కోసం పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ పోరటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో వాల్మీకులపై ప్రేమ చూపి హామీలు ఇచ్చి అధికారం వచ్చాక మరచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఏ రాజకీయ పార్టీలు ముఖ్యం కాదని ఎస్టీలుగా గుర్తించిన వారే దేవుళ్లతో సమానమని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని అయితే కమిటీ పేరుతో కాలయాపన జరుగుతోందన్నారు. ఇప్పటికైనా వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని కో రారు. దీనికి గ్రామస్థాయి నుంచి ప్రతి వాల్మీకి వర్గీయుడు ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి వి.రంగారెడ్డి

పత్తికొండ రూరల్: విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని జిల్లా విద్యాధికారి వి.రంగారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం సరోజిని హుసేనమ్మ అధ్యక్షతన, బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మస్తాన్‌వలి, బాలుర గురుకులంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సువర్ణలత అధ్యక్షతన పరీక్ష పర్వ్ 4.0 కార్యక్రమంలో భాగంగా సెలబ్రేషన్ ఆఫ్ ఎగ్జామ్‌పై ఓరియంటేషన్ కమ్ సెన్సిటైజేషన్ ప్రోగ్రాం ఫర్ స్కూల్ చిల్డ్రన్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వి.రంగారెడ్డి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సులభశైలిలో ప్రశ్నలకు సమాధానాలు నేర్చుకోవడాన్ని, పరీక్షలు రాసే విధానాన్ని వివరించారు. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. డైట్ లెక్చరర్ షంసుద్దీన్ మాట్లాడుతూ విద్య ప్రాధాన్యతను వివరించారు. సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ అరుణాచలం రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు భేష్




ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: పంటల నమోదుతో రైతులకు అన్ని విధాలుగా లబ్ధి చేకూరుతుందని రైతు భరోసా కేంద్రం కమిషనరేట్ డీడీఏ డి.వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని ఆలంకొండ గ్రామంలో పంట నమోదు చేసిన పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతాంగాన్ని అదుకునేలా పంటలను ఈ-క్రాప్ నమోదు చేయించి అండగా నిలుస్తోందన్నారు. గ్రామంలో దాదాపుగా 32 రికార్డులను పరిశీలించగా అన్నీ సక్రమంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆశయం నెరవేర్చే విధంగా అధికారులు పని చేయాలని ఆదేశించారు. పంట నమోదు ఆధారంగా రైతు దిగుబడులను గిట్టుబాటు ధరకు అమ్ముకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఏడీఏ బాలవర్ధిరాజు, ఏఓ వెంకటేశ్వర్లు, ఏఈఓ రాజేష్, వీఆర్వో విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

కనకవీడులో వైద్య శిబిరం

నందవరం: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యుడు బలరాం సూచించారు. మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో భీరప్ప దేవాలయం వద్ద మంగళవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామస్తులకు రక్త, బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. మురుగు కాలువలు, నీటి కుంటలు, డ్రైయినేజీలను శుభ్రం చేయాలని సూచించారు. అలాగే నాగలదిన్నెలో క్యాన్సర్ నివారణకు అవగాహన కోసం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు ఇస్మాయిల్, శాంతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదవాలి



మాట్లాడుతున్న ఏపీ ఎస్‌ఎస్‌ఏ పీఓ డాక్టర్ వేణుగోపాల్

వెల్దుర్తి: రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు మంచి మార్కులతో పాసయ్యేందుకు ఏకాగ్రతతో ప్రతి సబ్జెక్టును ఇష్టపడి చదవాలని ఏపీ సమగ్రశిక్ష అభియాన్ కర్నూలు పీఓ డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. మంగళవారం స్థానిక డాక్టర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకులం, పట్టణంలోని కేజీబీవీ, బాలుర, బాలికల హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఉద్దీపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఏడాదికి ఒక్కో విద్యార్థిపై రూ.92 వేలు ఖర్చు చేస్తోందన్నారు. అర్హత, అనుభవమున్న ఉపాధ్యాయులున్నారని, విద్యార్థులు పట్టుదలతో చదివి, ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ జ్యోతిర్మయి పరీక్షల సందర్భంగా పాఠ్యాంశాలు చదవడం, గుర్తుపెట్టుకోవడం, పరీక్షల్లో రాయడం తదితరాల వాటిపై సాంకేతిక పద్ధతిలో వివరిస్తూ, భయం లేకుండా, ఇష్టం లేని సబ్జెక్టునైనా బాగా చదువుకునేలా సలహాలు, సూచనలు ఇచ్చారు. మేధస్సు, జ్ఞాపకశక్తి పెంచుకునే విధానాలను వివరించారు. ఎంఈఓ ఇందిర, ఆయా పాఠశాలల ఎస్‌ఓలు, హెచ్‌ఎంలు లక్ష్మి ప్రసూన, విజయకుమారి, షాకీరా బేగం, జమ్ములన్న, అల్లుగుండు హెచ్‌ఎం మహమ్మద్ మియ్య, నిర్వాహకుడు టీచర్ మహేశ్వరరెడ్డి, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

సేవాఘడ్‌కు తరలిన తండావాసులు

తుగ్గలి: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాల సందర్భంగా మండలంలోని తండావాసులు మంగళవారం గుత్తి మండలం సేవాఘడ్‌కు తరలివెళ్లారు. సేవాలాల్ మహారాజ్‌ను బంజారాలు కారణ జన్ముడిగా ఆరాధిస్తారు. ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతి కావడంతో ఏటా సేవాఘడ్‌లో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు మండలంలోని ఆయా తండావాసులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

ఆలూరు: ప్రతిఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని కమ్మరచేడు, దేవనకొండ పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ మారుతి, రేష్మి సూచించారు. ఆలూరు మెయిన్ ఎంపీపీ పాఠశాలలో చిన్నారులకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆహార నియమాలు, తగిన మోతాదులో నీటిని తాగాలని, సైకిల్ తొక్కడం అలవాటు చేసుకోవాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

హొళగుంద: మార్చిలో జరిగే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో పట్టభద్రుల ఓటర్లు 527 మంది, టీచర్ ఓటర్లు ఆరుగురు ఉన్నారని, వీరికి రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌ఐ దినోజ్ ఉన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

హొళగుంద: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని హొళగుందకు చెందిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ మంగళవారం తెలిపారు. నిందితుడు ఆంధ్రా నుంచి కర్ణాటకకు తరలించేందుకు సిద్ధంగా ఉంచుకున్న 6 క్వింటాళ్ల (12 బస్తాలు) పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వెల్దుర్తి: తొగర్చేడు క్రాస్ రోడ్ వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో ఆటోల్లో అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్ట్ చేసి, ఆటోలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం తెలిపారు. నిందితులు కృష్ణగిరి మండలం పుట్లూరు మద్దిలేటి, కంబాలపాడు బోయ రాంపుల్లయ్య, కోడుమూరు మండలం కంసాలి సురేశ్, వెల్దుర్తి తెలుగు రామకృష్ణ, కర్నూలు హరికృష్ణ అని చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

శరవేగంగా రోడ్డు పనులు

మద్దికెర: మద్దికెర నుంచి బొజ్జనాయునిపేట గ్రామానికి వేస్తున్న తారు రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మంగళవారం కంకరపై మట్టిని తొలగించే పనులను ఐడీసీ డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు కోసం ఎదురుచూస్తున్న గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.2.75 కోట్లు నిధులు మంజూరు చేయించారన్నారు. ఈ నిధులతో రోడ్డు పనులు జరుగుతున్నాయని, త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డు

వెల్దుర్తి: మండల పరిధిలోని గోవర్ధనగిరి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కరెస్పాండెంట్‌గా సేవలందిస్తున్న గ్రామానికి చెందిన ఉల్లిగడ్డల మద్దిలేటికి ఉత్తమ సేవ అవార్డు వరించింది. ఈ మేరకు మంగళవారం కడప కేంద్ర కార్యాలయంలో బ్యాంక్ చైర్మన్ రాకేశ్ కశ్యప్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని దేవనకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. మండల కేంద్రం మీదుగా మంగళవారం కేఏ 03సీ9975 కారులో మద్యం తరలిస్తుండగా పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. కారులో ఉన్న నిందితులు అలారుదిన్నెకు చెందిన మునిస్వామి, బిల్లేకల్లు వడ్డె సుంకన్నపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ భూపాలుడు తెలిపారు. 20 బాక్సుల మద్యం స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశారు.మద్యంవిలువ రూ.60 వేలు ఉంటుందన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి



వేదావతి ప్రాజెక్టు ఇంజినీర్లతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ఆలూరు: హాలహర్వి మండలం వేదావతి నది ప్రాజెక్టును పూర్తి చేసేందుకు బిల్లులు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో పెండింగ్ ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా ఆయన మంగళవారం గూళ్యం గ్రామం వద్ద నిర్మిస్తున్న హైడ్రాలిక్ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన పనుల వివరాలను సైట్ ఇంజినీర్లు రాజేష్, రంగస్వామిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలన్నారు. వేదావతి ప్రాజెక్టు పూర్తి చేస్తే దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, వందకు పైగా గ్రామాలకు తాగునీటి సమస్య తీరుతుందని పేర్కొన్నారు.

అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సూచించారు. ఆలూరు సమీపంలో ఇటీవల వివాదాస్పదమైన చెరువు భూమిని మంగళవారం సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్యతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని, సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వనిత, రాష్ట్ర నాయకులు నాగేశ్వరావు, నంద్యాల జిల్లా సీపీఐ కార్యదర్శి రంగనాయకులు, నాయకులు హరినాథ్‌రెడ్డి, లెనిన్‌బాబు, నబీరసూల్ తదితరులు ఉన్నారు.

రైల్వే సేవలకు ఆటంకం కలిగించొద్దు

మద్దికెర: రైల్వే సేవలకు ఆటంకం కల్పించే వారిపై కేసులు నమోదు చేస్తామని గుంతకల్లు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి, ఏఎస్‌ఐ జీపీఎస్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం మద్దికెర ప్రధాన బజారులో ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. స్థానిక రద్దీకి అనుగుణంగా డబుల్ ట్రాక్ వేశారని, సకాలంలో గమ్య స్థానాలకు చేరేందుకు రైళ్ల వేగం పెంచారని తెలిపారు. పట్టాలకు సమీపంలో పశువులను మేపడం, వేగంగా వెళుతున్న రైళ్లపై రాళ్లు రువ్వడం, ట్రాక్ పక్కన కూర్చొని మద్యపానం చేయడం, గడ్డి కోసుకోవడం లాంటివి చేయరాదన్నారు. రైల్వే సేవలకు అంతరాయం కలిగించినా, ఆస్తులకు నష్టం కలిగించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సర్పంచ్ బండారు సుహాసిని, పంచాయతీ సలహాదారు బండారు ఆంజనేయులు, పంచాయతీ సభ్యులు కిట్టి తదితరులు పాల్గొన్నారు.

18న కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: మహాశివరాత్రి పురస్కరించుకుని చుంచుఎర్రగుడి గ్రామంలో ఈ నెల 18న అంతర్రాష్ట్ర బాలుర కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మీకాంతరెడ్డి మంగళవారం తెలిపారు. విజేతలకు వరుసగా రూ.20,116, రూ.15,116, రూ.10,116, రూ.5,116 అందించనున్నట్లు ప్రకటించారు. ఆసక్తి గల వారు రూ.300 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని వివరాలకు 73308692 87, 95153 93394 నంబర్లను సంప్రదించాలన్నారు.

జిల్లాస్థాయి భజన పోటీలు

కృష్ణగిరి: చుంచుఎర్రగుడి రామలింగేశ్వర స్వామి దేవాలయంలో 18న రాత్రి 7 గంటలకు జిల్లాస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నారు. గెలుపొందిన వారికి వరుసగా రూ.12,016, రూ.10,016, రూ.8,016, రూ. 6,016, రూ.4,016, రూ.2,016, రూ.1,516, రూ.1,016 అందించనున్నట్లు గ్రామస్తులు వెల్లడించారు. ఉత్తమ హార్మోనిస్టు, తబలిస్టు, గాయకులకు రూ.516 ప్రోత్సాహక బహుమతి ఉంటుందన్నారు. ఫోన్ నంబర్లు 94924 04979, 81878 68556ను సంప్రదించి అదే రోజు సాయంత్రం 4 గంటల్లోగా రూ.200 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

అమ్మవార్ల దేవర ప్రారంభం

కృష్ణగిరి: భక్తుల ఆరాధ్య దైవం ఆలంకొండ పెద్దమ్మ, సుంకులమ్మ దేవర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయమే అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామం బంధువులతో కళకళలాడుతోంది. గ్రామంలో పలు రకాలు అంగళ్లు, పిల్లలను ఆకర్షించే వివిధ ఆకృతులు నెలకొల్పారు. బుధవారం అమ్మవారికి ప్రతి ఇంటి నుంచి నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నేడు హెబ్బటంకు మంత్రి రాక

హొళగుంద: మండల పరిధిలోని హెబ్బటం గ్రామానికి బుధవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం వస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో జరిగే సామూహిక వివాహ కార్యక్రమంలో ఆయన పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదిస్తారని వెల్లడించారు. అలాగే శ్రీశైలానికి బయలుదేరే శివస్వాములకు వీడ్కోలు పలకనున్నట్లు తెలిపారు.

నాడు వివక్ష.. నేడు అభివృద్ధి



ముక్కెళ్లలో గొల్ల వీధిలో మురుగు కష్టాలు (నాడు)



సీసీ రోడ్డు వేసిన తర్వాత (నేడు)

తుగ్గలి: సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక మురుగుతో దుర్గంధం వెదజల్లుతూ, దోమల వల్ల రోగాల బారిన పడి ముక్కెళ్ల గ్రామ ప్రజలు దినదిన గండంగా బతికారు. పాలకులు, అధికారులకు మొర పెట్టుకున్నా కనికరించలేదు. ప్రధాన రహదారి, అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారై ఇళ్ల ముందు మురుగు నిలిచి నిత్యం దుర్గంధంతో ఇబ్బందులు పడ్డారు. ఇదంతా గతం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు సర్పంచ్‌గా గెలిచారని పాలకులు వివక్ష చూపారు. సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టకుండా వదిలేశారు. నేడు అదే గ్రామంలో టీడీపీ మద్దతుదారు సర్పంచ్‌గా గెలిచారు. అయితే టీడీపీ మాదిరి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎలాంటి వివక్ష చూపలేదు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కృషితో ఆర్‌అండ్‌బీ నిధులు రూ.20 లక్షలు, ఎంపీ నిధులు రూ.20 లక్షలతో గ్రామంలోని ప్రధాన రోడ్డు, గొల్ల వీధిలో సీసీ రోడ్లు వేశారు. దీంతో మురుగు కష్టాలు తొలగాయి. అభివృద్ధే ధ్యేయంగా చొరవ చూపి సీసీ రోడ్ల నిర్మాణాలకు కృషి చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.